## ‘ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రకల్ప 2కే23’



ప్రాజెక్టు ఎక్స్‌పోలో ఎగ్జిబిట్లను వివరిస్తున్న విద్యార్థులు

మణికొండ, డిసెంబర్ 8: శ్రీదేవి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ‘ప్రాజెక్ట్ ఎక్స్‌పో ప్రకల్ప 2కే23’ను నిర్వహించారు. ఐటీ విభాగం విద్యార్థులు వినూత్నమైన 30 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ఎక్స్‌పోను 500 మంది విద్యార్థులు సందర్శించి, సాంకేతికతలపై జ్ఞానాన్ని పొందారన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం హెచ్‌వోడీ, కన్వీనర్ డాక్టర్ బి.నరేంద్రకుమార్, డీన్ అకడామిక్స్, డీన్ ఆఫ్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యూయేషన్, ఇతర డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 6, 7న ‘లక్కీ అలీ లైవ్ కాన్సర్ట్’

### హైదరాబాద్‌లో వన్ నైట్ ఎట్ ఇస్తాంబుల్



లక్కీ అలీ లైవ్ కన్సర్ట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టర్కీ కాన్సుల్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకాన్ తదితరులు

బంజారాహిల్స్, డిసెంబర్ 8: టర్కీలోని ఇస్తాంబుల్‌కు చెందిన ‘సలామ్ సౌక్ ఎడిషన్–4’ తొలిసారిగా హైదరాబాద్‌లో ‘వన్ నైట్ ఎట్ ఇస్తాంబుల్’ పేరుతో నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక షాపింగ్ ఫెస్టివల్‌లో ప్రఖ్యాత బాలీవుడ్ సింగర్ లక్కీ అలీ లైవ్ కాన్సర్ట్ నగరవాసులను అలరించనున్నది. జనవరి 6, 7 తేదీల్లో మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న షాపింగ్ ఫెస్టివల్‌కు సంబంధించిన వివరాలను శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్‌లో టర్కీ కాన్సుల్ జనరల్ ఒర్హాన్ యాల్మన్ ఒకాన్, సలామ్ హౌక్ ఫౌండర్ సీఈవో తారా ఖాన్ తదితరులు వెల్లడించారు. తెలంగాణ పర్యాటక శాఖ, టర్కీ కాన్సులేట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఫెస్టివల్‌లో భాగంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 130 రిటైల్ స్టాళ్లు, 25 ఫుడ్ కోర్ట్స్‌తో పాటు అమ్యూజ్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఈ సందర్భంగా బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ ప్రత్యేక లైవ్ కాన్సర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నదని చెప్పారు.

## సూత్ర సందడి



బంజారాహిల్స్, డిసెంబర్ 8: దేశంలోని పలు నగరాలకు చెందిన ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను నగరవాసులకు అందించేందుకు బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో సూత్ర వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మోడల్స్ విభిన్నమైన డిజైన్ల వస్త్రాలు.. ఆభరణాలు ధరించి సందడి చేశారు. ఈ ప్రదర్శన 10వ తేదీ దాకా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నేత కార్మికులకు చేయూతగా నిలవాలి

### మేయర్ గద్వాల్ విజయలక్ష్మి




నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

మాదాపూర్, డిసెంబర్ 8: నేత కార్మికులకు ప్రతి ఒక్కరూ చేయూతగా నిలవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గ్లామ్ పరిక్రమ లగ్జరీ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హాజరై ఆయూష్ డైరెక్టర్ హరిచందన, జేఎన్ఏఎఫ్ఏయూ వీసీ కవితా దర్యానీరావు, వీ హబ్ సీఈవో దీప్తీ రావుల, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్ పర్సన్ అనురాధా బిష్ణోయ్, ఫిక్కీ ఫ్లో హైదరాబాద్ ఛాప్టర్ రీతూ షా, ఐఐఐడీ చైర్ పర్సన్ పల్లవి అంచూరి, ఇంటీయిర్ డిజైనర్, కడనీ ఆర్ట్ గ్యాలరీ వ్యవస్థాపకురాలు సుప్రజా రావు, మిసెస్ ఇండియా తెలంగాణ 2023 విజేత రాను శర్మలతో పాటు నిర్వాహకురాలు సోనా చెట్వానీతో కలిసి శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ... నేత కార్మికులను చేయూతగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. మహిళల మనసును దోచే అన్ని రకాల ఫ్యాషన్ ఉత్పత్తులు ప్రదర్శనలో కొలువుదీరడం సంతోషంగా ఉందన్నారు. కాగా, ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 150కి పైగా స్టాళ్లను ప్రదర్శించగా, స్టాల్స్‌లో పోచంపల్లి, గద్వాల్, కంచి, ఇక్కత్ వస్త్రాలతో పాటు పలు రకాల డ్రెస్ మెటీరియల్స్, గృహోపకరణ ఉత్పత్తులు, చేతితో తయారు చేసిన ఉత్పత్తులతో పాటు దేశంలోని పలు ప్రముఖ నగరాల విచ్చేసిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సిల్ వారు 5 స్టాళ్లను ఏర్పాటు చేశారు.



సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్

*-సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ)*



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

*-సిటీబ్యూరో, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ)*

## ‘50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి’



ఖైరతాబాద్, డిసెంబర్ 8: ప్రస్తుతం ఐదు శాతంగా ఉన్న ఐఆర్‌ను 15 శాతానికి పెంచాలని, పీఆర్సీ నివేదికను జనవరి వరకు తెప్పించి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని తెలంగాణ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల సంయుక్త పోరాట సమితి చైర్మన్ ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్ దవాఖానల్లో వచ్చే ఏడాది నుంచి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు రామ్‌శెట్టి, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, జయేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లెట్స్‌తో సంతోషకరమైన జీవితం

### డీఆర్‌డీవోలో ఘనంగా చిరు ధాన్యాల వనభోజన సమ్మేళనం

సైదాబాద్, డిసెంబర్ 8: అంతర్జాతీయ మిల్లెట్స్ స్వచ్ఛతా పఖ్వాడా–2023 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో టౌన్‌షిప్ ఎస్టేట్ నర్సరీలో ‘మిల్లెట్స్ మిలన్’ (చిరు ధాన్యాల వన భోజన సమ్మేళనం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌డీ) చీఫ్ ఇంజినీర్, ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో ప్రతి ఒక్కరూ సాధారణ ఆహార పదార్థాలకు ప్రత్యామ్నాయంగా మిల్లెట్‌లను స్వీకరించి.. ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా సంతోషకరమైన జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు సాధారణ ఆహార పదార్థాలకు ప్రత్యామ్నాయంగా, మిల్లెట్ ఆధారిత భోజనాన్ని ఏర్పాటుచేసి, అనంతరం వివిధ చెట్లు, మొక్కలు, హైబ్రిడ్ పువ్వులను వారికి అందజేశారు. అనంతరం స్థానికులకు, ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల కోసం ఓపెన్ డే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. డీఆర్‌డీవో ల్యాబ్ డైరెక్టర్లు జీఏ శ్రీనివాస మూర్తి, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ అనిల్ ఖురానా తదితరులు పాల్గొన్నారు.



కంచన్‌బాగ్ డీఆర్‌డీవోలోని ఎస్టేట్ నర్సరీలో అధిక సాంద్రతతో సాగు చేసిన కూరగాయలను పరిశీలిస్తున్న మేనేజర్ డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్

# నోరూరిస్తున్న పర్షియన్ ఫుడ్ ఫెస్టివల్

మాదాపూర్, డిసెంబర్ 8: నోరూరించే పసందైన వంటకాలు భోజన ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని నోవాటెల్‌లో హైబా (హైదరాబాద్ బ్రింగ్స్ ఆరేబియా) చెఫ్ అజీ కరామీ ఆధ్వర్యంలో శుక్రవారం పర్షియన్ ఫుడ్ పాప్ అప్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రూబిన్ చెరియన్ మాస్టర్ చెఫ్ అజీ కరామీతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రూబిన్ చెరియన్ మాట్లాడుతూ ... భోజన ప్రియులకు పసందైన సరికొత్త రుచులను పర్షియన్ ఫుడ్ పాప్ అందిస్తుందన్నారు. మాస్టర్ చెఫ్ అజీ కరామీ అంతరించిపోతున్న పర్షియన్ సాంప్రదాయ వంటకాలను నగర వాసులకు పరిచయం చేసేందుకు ప్రత్యేక మెనూను అందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగా నోరూరించే కబాబ్‌లతో పాటు ప్రత్యేక కోర్సులో భాగంగా సాంప్రదాయ పర్షియన్ వంటకాలైన సూప్ షిర్ ఓ పుర్స్, రూబియే సూప్, జాఫ్రాన్ కాటేజ్ చీజ్, ఫల్దారీ, జూజే, పర్షియన్ కూబిదే, వెజ్ జెరెష్క్ పోలో, జెరెష్క్ పోలో బా మోర్గ్, భాగాలి పోలోతో పాటు ముక్కలు చేసిన మటన్ రాన్ వంటి ప్రత్యేక వంటకాలు భోజన ప్రియులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని, పర్షియన్ ప్రత్యేక వంటకాలను నగర వాసులను పరిచయం చేసేందుకు నోవాటెల్‌తో కలిసి నడవడం ఎంతో ఆనందంగా ఉన్నదని మాస్టర్ చెఫ్ అజీ కరామీ అన్నారు.



పర్షియన్ ఫుడ్ ఫెస్టివల్‌లో కొలువుదీరిన పసందైన వంటకాలు



ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రముఖ చెఫ్ అజీ కరామీ